## పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే జె.సి



సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

పట్టణంలోని టైలర్స్ కాలనీలోని 21,23,24 వార్డుల్లో మంగళవారం ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వార్డుల్లో తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగితెలుసుకున్నారు. ఇందులో భాగంగా పలువురు సమస్యలను ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు టాటా హాజీబాష, 21వవార్డు కౌన్సిలర్ హుస్సేన్‌పీరా, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి ఫరూక్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## గొర్రెల సంతను వేరొక చోటికి తరలించాలని తహాశీల్దార్‌కు వినతి



తహాశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

**యాడికి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

మండల కేంద్రం కోన రోడ్డులో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గొర్రెల సంతను మరోచోటికి మార్చాలని కోరుతూ మంగళవారం తహాశీల్దార్ ప్రతాప్‌రెడ్డికి ఎంఆర్‌పిఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోన రోడ్డు నందు జరిగే గొర్రెల సంత వల్ల ఆ దారిపై వెళ్లే వాహనాలతో పాటు గ్రామస్తులు, ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారన్నారు. ఈ సమస్యపై పలుమార్లు వినతిపత్రం అందజేసినట్లు వారు గుర్తు చేశారు. కత్తిమానుపల్లి, ఓబులాపురం, కోన ఉప్పలపాడు, చంద్రాయునిపల్లి, రామన్న గుడిసెలు, రెడ్డివారి గుడిసెలు గ్రామాల ప్రజలు, పాఠశాలలు కళాశాలలు వెళ్లే విద్యార్థులు ఉపాధ్యాయులు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈనెల 15వ తేదీన శ్రీకోనరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే మహాశివరాత్రి తిరుణాలకు వేలాదిగా భక్తులు తరలివస్తారని కోనలో రామలింగేశ్వరస్వామి కళ్యాణ ఉత్సవాలు మొదలవుతాయన్నారు. 15వతేదీ ఆదివారం రాత్రి జాగరణ. 16వతేదీ సోమవారం స్వామివారి కల్యాణం, 19న తిరుణాల ముగుస్తుందన్నారు. స్పందించి ప్రజలకు ఇబ్బంది లేని చోట అందరికి సౌకర్యమైన చోట గొర్రెల సంత ఏర్పాటు చేయాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు పాతకుట్ల బాలు, చిరంజీవి, చిన్న, ఏసు, తదితరులు పాల్గొన్నారు.

## బండ్ల గణేష్ సంకల్పయాత్రకు సంఘీభావం తెలిపిన బుల్లెట్ లింగమయ్య




సంఘీభావం తెలుపుతున్న బుల్లెట్ లింగమయ్య

**తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

సినీ నిర్మాత బండ్ల గణేష్ చేపట్టిన సంకల్పయాత్రకు మంగళవారం కడపలో తాడిపత్రి పట్టణానికి చెందిన శ్రీమహర్షి వాల్మీకి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ లింగమయ్య సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు జైలు నుండి క్షేమంగా ఇంటికి వస్తే నా గడప నుండి తిరుమల దేవస్థానం గడప వరకు పాదయాత్రగా వస్తానని బండ్ల గణేష్ మొక్కుకున్న మొక్కును తీర్చుకునేందుకు సంకల్ప పాదయాత్ర చేపట్టిన బండ్ల గణేష్‌కు గ్రామ గ్రామాన అపూర్వ స్వాగతం లభిస్తోందని, టిడిపి నాయకులు, కూటమి నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వాగతం పలకడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి, ఎంపి అంబికా లక్ష్మినారాయణ ఆదేశాలతో బండ్ల గణేష్ సంకల్పయాత్రలో పాల్గొని సంఘీభావం తెలపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పుష్ప నారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు. బోడాయిపల్లి ఆది, శ్రీమహర్షి వాల్మీకి సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు. ఎస్‌సి, ఎస్‌టి రాష్ట్ర అధ్యక్షుడు గంగరాజు. రైతు సంఘం ఉపాధ్యక్షులు నీలకంఠారెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి రాష్ట్ర నాయకుడు సాయికుమార్ పాల్గొన్నారు.

## చింతచెట్టుపై నుండి కిందిపడి వ్యక్తి మృతి



శ్రీనివాసులు (ఫైల్‌ఫోటో)

**పెద్దవడుగూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

మండలంలోని విరుపాపురం గ్రామం వద్ద చింతచెట్టుపై నుండి కిందపడిన సంఘటనలో శ్రీనివాసులు (53) అనే వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా వున్నాయి. నంద్యాల జిల్లా ప్యాపిలి గ్రామానికి చెందిన దొమ్మరి శ్రీనివాసులు అనే వ్యక్తి కాసేపల్లి గ్రామానికి చెందిన లక్ష్మిరెడ్డి అనే వ్యక్తికి చెందిన విరుపపురం గ్రామం వద్ద వున్న 6 చింతచెట్లకు వున్న చింతకాయలను రెండు నెలల క్రితం కొనుగోలు చేశాడు. మంగళవారం తన కుటుంబ సభ్యులతో ప్యాపిలి నుండి విరుపాపురంకు వచ్చి చింతచెట్టు ఎక్కి చింతకాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు శ్రీనివాసులు చెట్టు కొమ్మ విరిగి కిందపడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో శ్రీనివాసులు భార్య పుష్పవతి, బంధువులు గాయపడిన శ్రీనివాసులును 108 అంబులెన్సులో గుత్తి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే శ్రీనివాసులు మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. ఈ సంఘటనపై శ్రీనివాసులు భార్య పుష్పవతి ఫిర్యాదు మేరకు పెద్దవడుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తనను బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు

**యల్లనూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

యల్లనూరు మండలం దంతలపల్లి గ్రామానికి చెందిన రామాంజనమ్మ తనను బెదిరించారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలు ఇలా వున్నాయి. రామాంజనమ్మ భూమిలోకి అదే గ్రామానికి చెందిన ఆమె భర్త అన్న కొడుకులు అయిన ప్రసాద్‌రెడ్డి, రామాంజులరెడ్డిలు అక్రమంగా ప్రవేశించి జెసిబితో కంపెచెట్లను తొలగిస్తుండగా రామాంజనమ్మ వెళ్లి తన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి ఇలా నా అనుమతి లేకుండా జెసిబితో కంప చెట్లు తీయడం ఏంటని అడుగగా అందుకు వారు ఆమెను నానా దుర్భాషలాడి, నీకు దిక్కున్న చోట చెప్పుకోపో, అడ్డం వస్తే నీ అంతు చూస్తామని బెదిరించారని రామాంజనమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## జిల్లా వ్యాప్తంగా రాత్రివేళ పోలీసుల విస్తృత తనిఖీలు



ప్రధాన ప్రాంతాలలో తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసులు

**అనంతపురం కలెక్టరేట్ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ మరియు ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా పోలీసులు విస్తృత స్థాయిలో రాత్రివేళ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, బ్యాంకులు, ఏటిఎం కేంద్రాలు మరియు వాటి పరిసర ప్రాంతాల్లో అనుమానితులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. అలాగే దేవాలయాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేస్తూ పోలీసు బందో బస్తును మరింత పటిష్టం చేశారు. వాహనాల తనిఖీలు నిర్వహించి నిషేధిత వస్తువులు, తదితరాల అక్రమ రవాణాలకు అడ్డుకట్ట వేశారు. జిల్లాలో శాంతి భద్రతలు, ప్రజల ప్రాణ రక్షణే ధ్యేయంగా ఇలాంటి ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగిం చాలని పోలీసులకు ఎస్పీ ఆదేశాలిచ్చారు. అలాగే జిల్లా ఎస్పీ పి.జగదీష్ అనంతపురం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన సి.వెంకటేశ్వర్లును మంగళ వారం ఘనంగా సన్మానం చేశారు. తన సేవా కాలంలో ఉత్తమ పనితీరుకు గాను 20 జిఎస్ ఈలు, 10 నగదు బహుమతులు పొందారు. ఆయన సేవలను ఈసందర్భంగా గుర్తు చేసుకుని ప్రశంసించారు. డిపిఓ లోని తన ఛేంబర్లో జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఎస్సై వెంకటేశ్వర్లను శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేసి అభినందించారు. ఆయన భవిష్యత్ జీవితం ఆరోగ్యం, ఆనందం, సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, త్రీటౌన్ సి.ఐ రాజేంద్రనాథ్ యాదవ్, ఆర్ ఐ లు మధు, పవన్ కుమార్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్, లక్ష్మినారాయణ, తదితరులు పాల్గొన్నారు.



పదవీ విరమణ పొందిన ఎస్సైని సన్మానిస్తున్న ఎస్పీ

## దేవుడి సొమ్ము తిన్న వారు ఎవరూ బాగుపడరు

-హాజీవలి దర్గా ఉరుసు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం -తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**



సమావేశంలో మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి మండలం తలారిచెరువులో వెలిసిన హజరత్ హాజీవలి దర్గా అభివృద్ధి కమిటీ సమావేశాన్ని తాడిపత్రి మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం ఏర్పాటు చేశారు. హాజీవలి దర్గా ఉరుసు ఉత్సవాలను మార్చి 5, 6 ,7 తేదీల్లో నిర్వహించనున్నారు. దర్గా ఉరుసు ఉత్సవాలకు సంబంధించి దర్గా వద్ద అభివృద్ధి కమిటీ సమావేశాన్ని షబ్బీర్‌బాష (గోర బాష) ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దర్గా ఉరుసు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడానికి పలు సూచనలు చేశారు. రంగురంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు ఇబ్బందులు పడకుండా అవసరమైన తాత్కాలిక టాయిలెట్లు ఏర్పాటు చేసి, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఉరుసు ఉత్సవాలకు ఎంత ఖర్చవుతుందో చెప్పాలన్నారు. అదాని సిమెంట్ యాజమాన్యంతో మాట్లాడి సౌకర్యాల కోసం సహకారం అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గత ప్రభుత్వంలో ఫయాజ్‌బాష వద్ద ఎనిమిది లక్షల రూపాయలు ఉన్నాయని కొంతమంది చెప్పగా ఫయాజ్‌బాష తనకు రాజకీయంగా శత్రువే గాని వ్యక్తిగతంగా కాదన్నారు. ఫయాజ్ తన తండ్రి నజీర్‌సాహెబ్ పేరుతో దానధర్మాలు చేస్తూ ఉంటారని ఆయన దర్గా డబ్బులు ఉంచుకోరన్నారు. ఒకవేళ ఫయాజ్‌బాష దగ్గర హాజీవలి దర్గా డబ్బులు ఉంటే కమిటీ ఇవ్వాలని సూచించారు. దర్గా అభివృద్ధికి ఫయాజ్‌బాష సహకారం అందించాలన్నారు. తాడిపత్రిలో ఉన్న సిద్ధిబాష దర్గాను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలన్నదే తన అభిమతమన్నారు. ప్రతిరోజు సిద్దిబాషా చిత్రపటానికి మొక్కుకున్న తరువాతే తన దినచర్యను ప్రారంభిస్తామన్నారు. దేవుని సొమ్ము తిన్న వారు ఎవరు బాగుపడరని జె.సి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు అధ్యక్షులు అయుబ్, టిడిపి పట్టణ అధ్యక్షులు హాజీబాష, నాయకులు నియాజ్‌బాష, టిడిపి కౌన్సిలర్ అబ్దుల్‌రహీం, దూదేకుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

## తేరన్నపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

**తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

తాడిపత్రి మండలం తేరన్నపల్లి గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి ఎం.రవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రబీ పంటలకు సంబం ధించిన ఈ-పంట నమోదును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రబీలో సాగు చేసిన పంటలకు ఈ-పంట నమోదు వేగవంతం చేయా లని సూచించారు. పప్పుశనగ పంట నమోదును త్వరగా పూర్తి చేయాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏఓ వంశీ, తాడిపత్రి మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు, విఏఏ అనిల్, రైతులు పాల్గొన్నారు.

## అప్పులబాధతో వ్యాపారి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న నరేంద్రకుమార్

**తాడిపత్రిఅర్బన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలోని వైఎస్‌ఆర్ సర్కిల్‌లో బియ్యం వ్యాపారం చేస్తున్న నరేంద్రకుమార్ (48) అనే వ్యాపారి తన షాపులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నరేంద్ర కుమార్ మెయిన్‌బజార్‌లో భార్య రజనీకుమారితో కలిసి నివాసం ఉంటున్నారు. అతనికి ఇరువురు పిల్లలు ఉన్నారు. అప్పులబాధతో మనస్థాపానికి గురై నరేంద్రకుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని అతని సన్నిహితులు చర్చించుకుంటున్నారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు బియ్యం దుకాణం వద్దకు వెళ్లి మృతదేహాన్ని కిందకు దింపి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తన ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, అప్పులు తీసుకున్న వారి వివరాలు పొందుపరిచి సూసైడ్ నోట్ రాసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

## శ్రీకోనవీరాంజనేయస్వామికి ఆకుపూజలు



**తాడిపత్రిరూరల్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

తాడిపత్రి మండలం ఆలూరుకోనలో వెలసిన శ్రీకోనవీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం పురస్కరించుకుని ఉదయం స్వామివారికి అర్చకులు అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు భక్తులు స్వామివారికి ఆకుపూజలు చేయించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అదేవిధంగా రంగనాథస్వామి, షిరిడిసాయి బాబాను దర్శించుకుని పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులు అన్నదాన సత్రంలో భోజనాలు చేశారు.

## గ్రామపంచాయతీ సమావేశం

**యాడికి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

యాడికి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచు పండు అనురాధ అధ్యక్షతన మంగళవారం గ్రామపంచాయతీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపసర్పంచు కాసా చంద్రమోహన్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీలోని పారిశుధ్య సమస్యలు, రాబోయే వేసవికాలంలో నీటి సమస్య గురించి చర్చించడం జరిగింది. కొంతమంది వార్డు సభ్యులు తమ వార్డులో ఉన్న సమస్యలను గ్రామపంచాయతీ సమావేశంలో చర్చించడం జరిగింది. మార్చి నెలలో జరగబోయే శ్రీశివలక్ష్మిచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు గ్రామ పంచాయితీ నుంచి సహకారాలు అందించుటం గురించి చర్చించడం జరిగింది. గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారి సాయిఅరుణ్‌కుమార్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కారం చేస్తామని ఆయన తెలియచేశారు.

## రెండు బైకులు డి ఒకరికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన టోపీ సాబ్

**ముదిగుబ్బ. జనవరి 3 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన ముదిగుబ్బ నాయి బ్రాహ్మణ కాలనీ వద్ద కదిరి అనంత పురం జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొనడంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక కస్తూరిబాయ్ కాలనీలో నివాసముంటున్న టోపీ సాబ్ తన పని నిమిత్తం కాలనీ నుండి ముదిగుబ్బ టౌన్ లోకి వస్తుండగా ముదిగుబ్బ టౌన్ నుంచి ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో రెండు ద్విచక్ర వాహనాలు కిందపడిపోయాయి. ఈ ప్రమాదంలో టోపీ సాబ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సమాచార మందుకున్న ముదిగుబ్బ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని 108 ద్వారా క్షత గాత్రుని చికిత్స నిమిత్తం బత్తలపల్లి ఆర్ డి టి ఆసుపత్రికి తరలించారు

## ఆయుష్ పై ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలకు అవగాహన



ఆశ , ఏఎన్ఎం లకు ఐ,ఇ,సి మెటీరియల్ అందజేస్తున్న దృశ్యం

**తలుపుల, ఫిబ్రవరి 02, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల యందు మంగళవారం ఆయుష్ వైద్య విధానం పై ఆశా వర్కర్లు, ఏఎన్ఎం లకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు హోమియోపతి వైద్యులు లక్ష్మీనరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఆయుష్ వైద్య విధానం పై వివరించి చెరువు చేయడానికి ప్రభుత్వ విధి విధానాలను తెలియజేయాలన్నారు. ముఖ్యంగా ఆహార అలవాట్లు మార్చుకొని దీర్ఘకాల వ్యాధుల నుండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. ఆశ, ఏఎన్ఎంలు ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటారు,కాబట్టి ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అందజేసిన పుస్తకాలు, ఐ, ఈ,సి మెటీరియల ను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు.

## కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆర్డిఓ కేశవనాయుడు



కందులను పరిశీలిస్తున్న ఆర్డిఓ కేశవనాయుడు

**శింగనమల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆర్డిఓ కేశవనాయుడు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడుతూ.. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన వివరాలు, రైతుల ఖాతాల్లో జమా చేసిన నగదు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయానికి వెళ్లి ఆయన ఆ కార్యాలయం సిబ్బందితో మాట్లాడుతూ.. అభివృద్ధి పనులను మరింత వేగవంతంగా కొనసాగించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేపట్టిన పి-4 కార్యక్రమానికి ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట తహాశీల్దారు శేషారెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఎన్.అన్వేష్ కుమార్, ఎంపిడిఓ కార్యాలయం పరిపాలన అధికారి నాగభూషణరెడ్డి, పి-4 నియోజకవర్గ కన్వీనర్ రామలింగ, పి-4 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎంపిడిఓ కార్యాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డిఓ కేశవనాయుడు

## నకిలీ ధృవపత్రాలు ఆధారంగానే పింఛన్ రద్దు

- పల్లెపై అబాండాలు వేయడం సమంజసం కాదు
- ఖండించిన టిడిపి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**

నకిలీ ధృవపత్రాల ఆధారంగానే మండలంలోని చెరువుమునెప్పగారిపల్లికి చెందిన ముగ్గురు వ్యక్తులకు పింఛన్ రద్దు అయిందని టిడిపి నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ జయచంద్ర, అల్లాపల్లి సింగిల్ విండో ఛైర్మెన్ శివారెడ్డి, మార్కెట్ యార్డ్ డైకర్టర్ నిజాం, కంచి సురేష్, మాజీ కన్వీనర్ రాజారెడ్డి, డీలర్ సుధాకర్‌రెడ్డిలు బ్లూ మీడియాలో ప్రచురితమైన పల్లె సార్ చెప్తేనే పింఛన్ అన్న కథనాన్ని ఖండించారు. అనంతరం వారు మాట్లాడుతూ...సిఎం చంద్రబాబు నాయుడు సారధ్యంలోని యన్డీయే ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరి సంక్షేమ పథకాలను అందచేస్తోందన్నారు. నియోజకవర్గంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మచ్చలేని నాయకుడిగా, అజాత శత్రువుగా పేరుగడించాడనా న్నరు. అలాంటి పల్లెపై బ్లూ మీడియాలో అసత్య కథనాలు ప్రచురించడం పరిపాటిగా మారిందన్నారు. అయితే మండలంలోని చెరువుమునెప్పగారిపల్లికి చెందిన ముగ్గురు వ్యక్తులు పింఛన్ పొందే వయసులేకున్నా నకిలీ ఆధార్‌తో పింఛన్ తీసుకోవడాన్ని గుర్తించి అధికారులు వారికి పింఛన్ ఆపేవేయడం జరిగిందన్నారు. అసలైన ధృవపత్రాలు సమర్పించి యధావిధిగా పింఛన్ తీసుకోమని అధికారులు వారికి నోటీసులు సైతం ఇచ్చారన్నారు. నాలుగు నెలలుగా అసలైన ధృవపత్రాలు ఇవ్వని కారణంగానే అధికారులు పింఛన్ రద్దు చేశారన్నారు. కేవలం సంబంధిత పత్రాలు ఇవ్వకపోవడంతోనే వారికి పింఛన్ ఆగిందే కాని ఇందులో పల్లె ప్రమేయం, స్థానిక నాయకులు ప్రమేయం ఎక్కడాలేదన్నారు. ఇప్పటికైనా సదరు బ్లూ మీడియా వాస్తవాలు తెలుసుకుని కథనాలు వెలువడించాలని లేకపోతే మీడియా పట్ల ప్రజలు విశ్వసనీయతను కోల్పోతారన్నారు.

## సమయపాలన పాటించని హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి

- ఏబివిపి జిల్లా కన్వీనర్ వాసుదేవ

**ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త**



మూసిఉన్న హెచ్ఎం కార్యాలయం

సమయపాలన పాటించకుండా ఇష్టారీతిగా వ్యవహరిస్తోన్న మండలంలోని మిట్టపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఆఖిల భారత విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ వాసుదేవ డిమాండ్ చేశారు. కన్వీనర్ వాసుదేవ ఆధ్వర్యంలో మంగళవారం ఏబివిపి విద్యా ర్థి బృందం పాఠశాలను సందరి ్శంచారు. దాదాపు 10.45 గంటలైనా ప్రధానాపోధాయురాలు కార్యాలయం గది మూసిఉండడం గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకంకు సబంధించిన బియ్యం, గుడ్లు, చిక్కీలు ఇతర సామాగ్రి హెచ్ఎం ఆధీనంలో ఉడడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. గతంలో అవినీతి ఆరోపణలు, విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు గాను సదరు హెచ్ఎం రెండు సార్లు సస్పెన్షన్‌కు గురైనా తీరుమారలేదని ఆగ్రం చెందారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. హెచ్ఎంపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రేంచంద్, జనార్ధన్, వంశీలు పాల్గొన్నారు.

## కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశానికి తరలిరండి

**అమడగూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న ఇందుకూరి సురేంద్రారెడ్డి

పుట్టపర్తిలోని జిల్లా పార్టీ కార్యాలయంలో బిజెపి జిల్లా అధ్యక్షుఉ జిఎం శేఖర్ అధ్యక్షతన నిర్వహించనున్న కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశానికి తరలిరావాలని కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఇందుకూరి సురేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కుమారస్వామి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిసే దేవానంద్ పాల్గొంటారన్నారు. కావునా ఈ కార్యక్రమానికి జిల్లా కిసాన్ మోర్చా నూతన పదాధికారులు, రాష్ట్ర పదాధికారులు, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్

- ఏడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి

**శింగనమల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఉమ్మడి అనంతపురం జిల్లా ఏడిసిసి బ్యాంకు ఛైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి మంగళవారం నియోజకవర్గ పరిధిలోని గార్లదిన్నె మండలం ఇల్లూరు గ్రామానికి చెందిన తలారి వ ం ్ ణ ్ తే జ ్ స ్ ం రూ.4,43,923 తూర్పింటి నాగమ్మకు రూ.17,084 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపద సమయంలో పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సుంక నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్‌ఆర్‌సిపి కార్యకర్తను పరామర్శించిన బొమ్మనశ్రీరామిరెడ్డి

**శింగనమల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త**

మండల పరిధిలోని చిన్నమట్లగొంది గ్రామానికి చెందిన వైఎస్‌ఆర్‌సిపి కార్యకర్త మునీంద్ర అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకుని మంగళవారం వైఎస్‌ఆర్‌సిపి సీనియర్ నాయకులు బొమ్మనశ్రీరామిరెడ్డి వెళ్లి మునీంద్రను ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధైర్యంగా ఉండాలని, వైఎస్‌ఆర్‌సిపి అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఆయన వెంట వైసిపి నేతలు దుద్దుకుంట భాస్కర్‌రెడ్డి, ఎ ల్ . రా జు లు పాల్గొన్నారు

మునీంద్రను పరామర్శిస్తున్న బొమ్మన శ్రీరామిరెడ్డి →



06ATP27_06ATP27.qxd 03-02-2026 PM 10:48 Page 1



## ఘనంగా కొల్హాపురి మహాలక్ష్మి వేడుకలు

### - దేవికి హారతులు పడుతున్న మహిళలు

అగళి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త


దేవికి హారతులు పడుతున్న దృశ్యం

మండల పరిధిలోని గ్యారగొండనపల్లి గ్రామంలో కొల్హాపురి మహాలక్ష్మి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. గత రెండు రోజుల నుంచి వేడుకలు వైభవంగా జరుగుతునా న్నయి. రత్నగిరి గ్రామంలో వెలిసిన పురాతన మహాలక్ష్మి అమ్మవారిని గ్రామానికి శాస్త్రోక్తంగా డప్పు వాయిద్యాలతో, మేళతాళాలతో ఉత్సవ మూర్తిని గ్రామానికి తీసుకొచ్చారు. దేవికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మామిడి, అరటి తోరణాలతోపాటు పూలతో అలంకరించిన పందిరిలో కూర్చోబెట్టారు. మహిళలు ప్రత్యేకంగా మహాలక్ష్మికి చలువపిండి, గన్నేరుపూలు, వేపాకులు అమర్చిన దీపాలను దేవి చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. వందలాది మంది మహిళలు దేవికి దీపాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. డప్పులు, ఉర్రెలతో పూజారుల అనుమతితో దీపాలను దేవి చుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం గన్నేరు పూలను దేవి పందిరిపై వేయడం ఆనవాయితీ. ఇలా దేవి వేడుకల్లో పాల్గొంటే దీపాలను మోస్తే అంతా మంచే జరుగుతుందని, శుభాలు కలుగుతాయని, ఐశ్వర్యం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. మహా మంగళహారతి అనంతరం వేడుకలకు హాజరైన భక్తులతోపాటు బంధువులకు విందుభోజనాలను ఏర్పాటు చేశారు. ఎస్ఐ శోభరాణి, ఏఎస్ఐలు శ్రీరాములు, బషీర్, సిబ్బంది గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## 25వ వార్డులోని సమస్యలను పరిష్కరించండి

### కమిషనర్ ను విన్నవించిన టీడీపీనాయకులు

ధర్మవరంటౌన్, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త


నూతన కమిషనర్ ను కలిసిన పుష్పగుచ్చాన్ని అందజేస్తున్న టీడీపీ నాయకులు

పట్టణంలోని అన్ని వార్డులకంటే అత్యధిక జనాభా కలిగిన 25వ వార్డులో నెలకొన్న సమస్యలను పరిష్కరించేలా చూడాలని ఆ వార్డు టీడీపీ ఇన్చార్జ్ భీమనేని ప్రసాద్ నాయుడు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం భీమనేని ప్రసాద్ నాయుడుతో పాటు నాయకులు చీమలరామాంజి, గడ్డంసూరీ, క్లస్టర్ రామాంజి, రవి, భీమాలు ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ వెంకటరమణయ్యను కలిశారు. అనంతరం పుష్పగుచ్చం అందజేశారు. వార్డులో సీసీరోడ్లు, డ్రైనేజీలు, వీదిలైట్లు తదితర సమస్యలు తాండవిస్తున్నాయని వీటిని పరిష్కరించాలని కోరారు. స్పందించిన కమిషనర్ సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. టీడీపీనాయకులు, ప్రజలు వార్డుల్లో సహకరిస్తే మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. వార్డులో కూడా ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తేస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

## శ్రద్ధ, ఏకాగ్రతల తోనే విద్యలో రాణింపు

వజ్రకరూరు ఫిబ్రవరి 3 ప్రభాతవార్త


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈఓ2 తిమ్మప్ప

శ్రద్ధ, ఏకాగ్రతలతోనే విద్యలో రాణింపు సాధ్యమని ఎంఈఓ2 తిమ్మప్ప విద్యార్థులకు తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని రాగులపాడు జిల్లా పరిషత్ మీద పాఠశాలలు సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రభుత్వ అమలు చేస్తున్న వందరోజుల ప్రణాళికను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరగబోయే పరీక్షలలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచి పాఠశాలకు మంచి పేరు తేవాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

## దుర్గాదేవి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్ర కన్వీనర్

రొళ్ల ఫిబ్రవరి3 ప్రభాతవార్త


నేతలను సన్మానించిన దృశ్యం

మడకశిర నియోజకవర్గం గుడిబండ మండలం ఎస్ రాయపురం గ్రామంలో వెలిసిన దుర్గాదేవి అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవం మంగళవారం జరిగింది. ఈ ప్రారంభోత్సవంలో గ్రామస్తుల పిలుపు వరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కుంచిటిగ వక్కలిగ సాధికర సమితి కన్వీనర్ వి.ఎం. పాండురంగప్ప, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, రొళ్ల మండల బి సి సెల్ ప్రధాన కార్యదర్శి రవి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ తరఫున ముఖ్యఅతిథితులకు సన్మానించారు. వీరితో పాటు పలువురు వైసీపీ శ్రేణులు కూడా పాల్గొన్నారు.

## దళిత నాయకుల హత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

### - దాడులు, దౌర్జన్యాలు ఆపకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తాం

### - ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త


విలేఖరులతో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి

సమానత్వ, స్వేచ్ఛ, హక్కుల కోసం ఉద్యమాలు చేస్తున్న దళిత నాయకుల హత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని, దాడులు, దౌర్జన్యాలు ఆపకపోతే ఆందోళనలు ఉద్ధృతం చేస్తామని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సాకే హరి అన్నారు. పట్టణంలోని స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాకే హరి మాట్లాడుతూ దళిత, గిరిజనులపై దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తున్న దళిత, గిరిజన సంఘాల నాయకులను అతి దారుణంగా చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఆర్‌పీఎస్ నాయకులు టి.ఎం.రమేష్‌ను అతి కిరాతకంగా ట్రాక్టర్‌తో గుద్దించి రాడ్లతో విచక్షణారహితంగా దాడిచేసి చంపారన్నారు. గతంలో ఇదే తరహాలో దళిత గుండమ్మపై ఏకంగా వ్యవసాయ ట్రాక్టర్‌ను ఎక్కించి చంపేశారన్నారు. చిప్పగిరి లక్ష్మినారాయణను లారీతో గుద్ది మారుణాయుధాలతో నరికి చంపారన్నారు. వరుసగా ఒకే ప్రాంతంలో ఈ దారుణాలు జరుగడం మరింత బాధాకరమన్నారు. కుల వివక్షత అంటరానితనం, అత్యాచారాలు, దోపిడి, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా చట్టపరంగా ఉద్యమిస్తే అది శాపంగా మారి చివరికి ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోందన్నారు. ఈ దారుణాలకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం తక్షణం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దాడులు, హత్యలు చేసి దర్జాగా తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరిస్తున్న వారిని ఉపేక్షించరాదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళిత, గిరిజనులను ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యానికి దూరం చేస్తున్నాయని వాపోయారు. ఎస్సీ, ఎస్టీ ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేసి ఇలాంటి వారికి వెంటనే శిక్షపడేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జేఏసీ నాయకులు చిన్నముష్టూరు ఎర్రిస్వామి, శ్రీరాములు, నరేంద్ర, ఓబులేసు, నాగరాజు, సుంకన్న, ఈశ్వరయ్య, రామకృష్ణ, ఆనంద్, ధనుంజయ, ఆదాం, నరసింహులు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

## దాసుని తప్పు... దండించడం వరకేనా...?

### - శాఖపరమైన చర్యలు తీసుకోరా.. - క్షేత్రస్థాయిలో పెట్రేగిపోతున్న ట్రాన్స్‌కో సిబ్బంది అవినీతి లీలలు

ధర్మవరం రూరల్ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త


కాలనీలో ఏర్పాటుచేసిన కాసారాలు

విద్యుత్ శాఖ లో కిందిస్థాయి సిబ్బంది అవినీతి లీలలు పెరిగిపోతున్నట్లుగా ధర్మవరం డివిజన్లో సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సిబ్బంది చేసిన తప్పులను సమావేశాల లో నూ, సదస్సులలోనూ ఉన్నతాధికారులు మందలిస్తున్నారు. తప్ప వారిపై శాఖాపరమైన చర్యలకు పూనుకోవడం లేదన్న విమర్శలు లేకపోలేదు. వాస్తవానికి ధర్మవరం డివిజన్లో కొంతమంది ట్రాన్స్కో సిబ్బంది తీవ్రస్థాయిలో విద్యుత్ వినియోగదారుల వద్ద నుండి ముక్కు పిండిమరి వసూళ్ల దందాకు తెర లేపినట్లుగా తెలుస్తోంది. వినియోగదారుల సమస్యలను ఆసరాగా చేసుకున్న కొంతమంది ట్రాన్స్కో కిందిస్థాయి సిబ్బంది భారీగా ముడుపులు తీసుకుని తమ పబ్బం గడుపుతున్నట్లుగా ఆరోపణలు గుప్పుమంటున్నాయి. క్షేత్ర స్థాయిలో అనగా గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, చిన్న చిన్న పరిశ్రమల యజమానుల,చిన్నపాటి సమస్యలను సైతం తమ కనుకూలంగా మలుచుకుని విద్యుత్ ఉద్యోగులు కొంతమంది భారీ స్థాయిలో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నట్లు విమర్శలు లేక పోలేదు. ధర్మవరం డివిజన్లో క్షేత్ర స్థాయిలో విద్యుత్ ఉద్యోగులు కొంత మంది పోతులనాగేపల్లి లో కాసారాల ఏర్పాటు వ్యవహారంలో గుట్టుచప్పుడు కాకుండా తమ దందాను కొనసాగించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ట్రాన్స్‌కో డిఈ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో లైన్మెన్‌ను మందలించి వదిలిపెట్టినట్లుగా తెలుస్తుంది. అలా కాకుండా సదరు ఉద్యోగి పోయి శాఖా పరమైన చర్యలకు పూనుకొని ఉంటే విద్యుత్ శాఖలో కాస్తయినా అవినీతి అక్రమాలకు చెక్ పెట్టినట్లుగా ఉండేదని పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా విధుల పట్ల అంకితభావంతో పనిచేసే డిఈ కిందిస్థాయి ఉద్యోగులపై కొరడా ఝులిపించాలని పలువురు కోరుతున్నారు.

## గిరిజన గురుకుల పాఠశాలలో చేరేందుకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి (కలెక్టరేట్), ఫిబ్రవరి 03, ప్రభాతవార్త

శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని తనకల్లు లో ఉన్న బాలికలబిఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల యందు చెరదలచిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి జి రాజేంద్ర కుమార్ రెడ్డి కోరారు. 2026 27 విద్యా సంవత్సరంకు నూతన ప్రవేశము కొరకు 5వ తరగతి యందు 80 సీట్లు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. కావున అడ్మిషన్ కావలసిన బాలికలు http://twreiscet.apcfss.in లేదా http://aptwgurukulam.ap.gov.in/ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్ నందు దరఖాస్తులను ఈనెల 28 వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని, అడ్మిషన్ పొందు విద్యార్థులకు 2026 ఏప్రిల్ 4 తేదీన తనకల్లు లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాల యందు రాత పరీక్ష నిర్వహించి ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు పాఠశాల ప్రిన్సిపాల్ ఫోన్ నెంబర్:8500941752, 8333807978, 9652580709 లకు సంప్రదించాలని ఆయన కోరారు.

## భూములను వెబ్ ల్యాండ్లో నమోదు చేసుకోండి - ఆర్డీవో సువర్ణ


గ్రామ సభలో మాట్లాడుతున్న ఆర్డీవో సువర్ణ

బుక్కపట్నం, ఫిబ్రవరి 03, ప్రభాతవార్త

ఆడంగల్ నందు " క్లయిమ్ చేయని భూమి, ఇతరులు, పట్టదారులు/ అనుభవదారులు కాలమ్స్ లో ఉన్నాయని వాటికి సంబంధించిన పత్రాలు సమర్పించి వెబ్ ల్యాండ్ లో నమోదు చేసుకోవాలని పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ రైతులను కోరారు. మంగళవారం మండల కేంద్రమైన బుక్కపట్నం ఆర్.యస్.కే నందు తహశీల్దార్ నరసింహులు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో పాల్గొన్న ఆర్డీవో సువర్ణ మాట్లాడుతూ, భూ యజమానులు తమకు సంబంధించిన తగిన డాకుమెంట లాను సమర్పించాలని సూచించారు. భూమి అనుభవము మేరకు రెవిన్యూ రికార్డులు, ప్రక్క రైతులును విచారణ చేసి సదరు భూములను వెబ్ల్యాండ్ నందు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమములో వి.ఆర్ ఓలు, మండల సర్వేయర్ అంజన, ఈ.డీ.యం షేక్షావలి, రైతులు పాల్గొన్నారు.

## నేడు పేలుబండ గ్రామంలో పౌరాణిక నాటికకు తరలిరండి

అమరాపురం ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

మండల పరిధిలోని పేలుబండ గ్రామానికి చెందిన యువకులు బెంగళూరులో వివిధ ఉద్యోగాలు నిర్వహిస్తున్న వారు మరియు స్థానిక యువకులు కలిసి నేడు బుధవారం పేలుబండ లోనిర్వహించను న్నకురుక్షేత్రం పౌరాణిక నాటిక కు మండలంలోని మరియు సమీప కర్ణాటక ప్రాంతానికి చెందిన కళాకారులు అత్యధిక సంఖ్యలో హాజరుకావాలని కళాకారుల బృందం సభ్యులు తెలిపారు. పేలుబండ గ్రామస్తులు కళను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పాటు పురాతన ఇతిహాసాలను మరియు శ్రీకృష్ణుడి గీతాసారాన్ని తెలిపే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మడకశిర నియోజకవర్గంలోని మాజీ మంత్రి రఘువీరారెడ్డి, ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి , నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త ఈరలక్కప్ప తదితరులను ఆహ్వానించినట్లు సభ్యులు తెలిపారు. గ్రామ ప్రముఖులు, యువత, కళాకారులు పాల్గొన్నారు. పేలుబండ గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీ రంగనాథ స్వామి కళాకారుల బృందం మరియు సంగీత నిర్దేశకులు రామకృష్ణప్ప ఈ కార్యక్రమంలో యువకళాకారులు కాంతరాజు, విశ్వనాథ్, మల్లికార్జున, వెంకటేష్, రాఘవేంద్ర, ముద్ద రామప్ప, విజయ్, వై సిద్దేశ్వర, కే సిద్దేశ్వర, శేఖర్ ,నాగరాజు, డి ఆర్ రమేష్, డి ఆర్ నాగరాజు, బి పవన్ కుమార్, మంజునాథ్, టి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గ్రామ ప్రముఖులు గ్రామ ప్రజలు మరియు వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు విచ్చేసి ఈ కార్యక్రమాన్నివిజయవంతం చేయాలని కోరారు.

## తప్పుడు ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలపై చర్యలు తీసుకోండి

### -యుపీఎస్ సీఐ బి.మహానందికు పిర్యాదు చేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు


యుపీఎస్ సీఐ బి.మహానందికు వినతిపత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

పట్టణ కేంద్రాల్లో నెయ్యి కల్తీ అంశంపై సిట్ చార్జ్‌షీట్‌కు విరుద్ధంగా, వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, వై.వి.సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డిల ఫోటోలతో తప్పుడు, అపవాదులు కలిగిన పోస్టర్లను ఏర్పాటు చేసి ప్రజల్లో శాంతిభద్రతలకు భంగం కలిగే విధంగా వాటిని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోరింది. మంగళవారం ఆ పార్టీ నాయకులు స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో సీఐ బి.మహానందికు ఈ మేరకు పిర్యాదును అందజేశారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై వేసిన సిట్ దర్యాప్తు పూర్తిగా ల్యాబ్ నివేదికలు, డిజిటల్ ఫోరెన్సిక్ ఆధారాలు, పత్రాధారాలు చట్టబద్ధమైన సాక్ష్యాలపైనే ఆధారపడి సాగిందేగాని ఇందులో రాజకీయ పార్టీలు, వ్యక్తుల ప్రమేయం ఉందని ఎక్కడా నిర్ధారించలేదన్నారు. ఈ పరిస్థితుల్లో చార్జ్‌షీట్‌లో లేని ఆరోపణలను ప్రజా ప్రదేశాల్లో పోస్టర్ల రూపంలో ప్రచారం చేయడం అత్యంత అక్రమం, బాధ్యతారాహిత్యం, అపవాదులు కలిగించే చర్యగా భావించబడుతుందన్నారు. కేవలం వ్యక్తుల ప్రతిష్టను దెబ్బతీయడమే కాకుండా కోర్టులో పెండింగ్‌లో ఉన్న అంశంపై ప్రజల్లో తప్పుదారి పట్టించే భావజాలాన్ని సృష్టించే యత్నంగా ఉందన్నారు. ఈ పోస్టర్లను డిజైన్ చేసిన, ముద్రించిన, నిధులు సమకూర్చిన, ఏర్పాటు చేసిన వ్యక్తులు, టీడీపీ నాయకులను గుర్తించి వారిపై చట్టప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేసి సంబంధిత తప్పుడు, అపవాదులు కలిగిన పోస్టర్లను తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి తప్పుడు ప్రచారాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానాల లడ్డూ ప్రసాదంలో జంతు కొవ్వు (పంది కొవ్వు) అవు కొవ్వు, చేప నూనె కల్తీ జరిగిందని చేసిన ఆధార రహిత, అవమానకరమైన, బాధ్యతా రాహిత్యమైన ప్రజా ప్రకటనలవల్ల ప్రజల్లో అశాంతి, భక్తుల మధ్య విభజన, ప్రజాశాంతికి భంగం కలిగిన, సామాజిక సామరస్యంకై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు ఈడిగ ప్రసాద్, మాజీ ఎంపీపీ ఏ.సి.ఎర్రిస్వామి, పార్టీ నాయకులు యం.బసవరాజు, బి.వేమన్న, డి.శర్మస్, సుద్దల వెంకటేశ్వర్లు యాదవ్, అంగదాల అంజి, ఆరే రాజశేఖర్, పచ్చి రవి, బి.మల్లికార్జున, బెలగల్ షమ్ము, వడ్డే ఆంజినేయులు, చిన్న భీమా తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ఒక శాపం కాదు - సమయానికి గుర్తిస్తే పూర్తిగా నయం అయ్యే వ్యాధి

### డాక్టర్ మంజు వాణి

మడకశిర ఫిబ్రవరి 03 ప్రభాతవార్త:


డిప్యూటి డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ మంజువాణి

ప్రతి సంవత్సరం లక్షల మంది క్యాన్సర్ వల్ల ప్రాణాలు కోల్పోతున్నారు, అందులో చాలావరకు నివారించగల కేసులే అని డిప్యూటి డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మంజువాణి ఒక ప్రకటన లో తెలియచేశారు.

**క్యాన్సర్‌కు ప్రధాన కారణాలు:** పొగాకు వినియోగం (సిగరెట్లు, గుట్కా, ఖైనీ మొదలైనవి) మద్యం అధికంగా తీసుకోవడం, అనారోగ్యకర ఆహారఅలవాట్లు, వ్యాయామం లేకపోవడం, అధిక బరువు ఉండటం, కాలుష్యం, రసాయనాల ప్రభావం, పొగాకు వాడకం మానేస్తే సుమారు 40 క్యాన్సర్లు నివారించవచ్చునని అన్నారు.

**మహిళల్లో సాధారణంగా కనిపించే క్యాన్సర్లు:** స్తన (బ్రెస్ట్) క్యాన్సర్, గర్భాశయ మెడ (సర్వైకల్) క్యాన్సర్, పురుషుల్లో సాధారణంగా కనిపించే క్యాన్సర్లు ఊపిరితిత్తుల క్యాన్సర్, నోటి క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్‌లు వీటిని ప్రారంభదశలోనే గుర్తించి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా శరీరంలో ఎక్కడైనా ముద్దలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని, దీర్ఘకాలంగా తగ్గని దగ్గు అకారణంగా బరువు తగ్గడం,దీర్ఘకాల జ్వరం, రక్తస్రావం,గాయాలు మానకపోవడంలు జరిగితే స్క్రీనింగ్‌పరీక్షలు చేయించాలని తెలిపారు. 30ఏళ్లు దాటినమహిళలు – బ్రెస్ట్ , సర్వైకల్ స్క్రీనింగ్, 40 ఏళ్లుదాటినవారు. ఆరోగ్యపరీక్షలు క్రమంతప్పకుండా చేయించుకోవాలని అన్నారు. ఆరోగ్యకర జీవనశైలి క్యాన్సర్ నివారణలో కీలకమని అన్నారు. తాజా కూరగాయలు, పండ్లు తీసుకోవడం రోజూ కనీసం 30 నిమిషాల వ్యాయామం పొగాకు, మద్యం పూర్తిగా మానడం తగిన నిద్ర, క్యాన్సర్ పట్ల భయం అవసరం లేదని సూచించారు. అవగాహన అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో కూడా క్యాన్సర్ అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. క్యాన్సర్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై బాధ్యత తీసుకోవాలని కోరారు. సమయానికి పరీక్ష – సమయానికి చికిత్స – సంపూర్ణ ఆరోగ్యం" అన్నది మా సందేశమని తెలియజేశారు.

## మండలంలో జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప పర్యటన

తాడిమర్రి జనవరి 3 (ప్రభాతవార్త)


పాఠశాల ఏర్పాటు కోసం పరిశీలిస్తున్న డీఈఓ కిష్టప్ప

మండల పరిధి లోని మర్రిమేకలపల్లి గ్రామంలో మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప పర్యటించారు. ఎస్సీ కాలనీలో సందర్శించిన ఆయన ఉన్నత పాఠశాల ఏర్పాటు కోసం తగిన సౌకర్యాలపై గ్రామస్తులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యం కోసం మర్రిమేకలపల్లి గ్రామంలో ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయాలని గతంలో మంత్రి సత్య కుమార్ యాదవ్ ను గ్రామస్తులు కోరడం జరిగిందని గ్రామస్తుల కోరిక మేరకు మంత్రి సత్య కుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టి సారించి గ్రామంలో ఉన్నత పాఠశాల ఏర్పాటుకోసం చర్యలు చేపట్టడం జరిగిందని అన్నారు. త్వరలోనే ప్రభుత్వానికి తగిననివేదికలు అందజేసి ఉన్నత పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. అలాగే తాడిమర్రి మోడల్ ప్రైమరీ పాఠశాల మరియు మెయిన్ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులకు తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లు కృష్ణమోహన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందజేసిన...నాసన్ టీం


క్రీడా సామాగ్రి అందజేస్తున్న నాసన్ టీం

గోరంట్ల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

మండలంలోని బూదిలి ఉన్నత పాఠశాలను పాలసముద్రం దగ్గర ఉన్నటువంటి నాసిన్ కంపెనీవారు సందర్శించి పాఠశాలకు 25 వేల రూపాయల విలువగల క్రీడా సామాగ్రితో పాటు గ్రంథాలయానికి అవసరమైన జేఈఈ మెయిన్స్ నీట్ సంబంధించినటువంటి పుస్తకాలను అందచేయడం జరిగినది. మరో విడతలో పాఠశాలకు అవసరమైన కుర్చీలు, టేబుళ్లు అందచేస్తామని నాసిన్ వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన

గుడిబండ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మండల పరిధి లోని ఎస్ రాయపురం గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, రాష్ట్ర కుంచిటి వక్కలిగా ఛైర్మెన్ లక్ష్మీనారాయణ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడకశిర క్లస్టర్ ఇంచార్జ్ గుండుమల చంద్రప్ప మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప,సింగల్ విండో అధ్యక్షులు మద్దనకుంటప్ప,జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్,రామతమన్న, నాగేంద్రప్ప, ఎస్ రాయపురం తెలుగు దేశం పార్టీ నాయకులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన వై సురేష్ కు సన్మానం

పుట్టపర్తి (కల్చరల్), ఫిబ్రవరి 03, ప్రభాతవార్త


డిప్యూటీ కలెక్టర్ గా ఎంపికైన సురేష్ ను సన్మానిస్తున్న దృశ్యం

ఇటీవల వెలువడిన గ్రూప్1 ఫలితాలలో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన లేపాక్షి గురుకుల పాఠశాల పూర్వ విద్యార్థి వై. సురేష్ ను అభినందిస్తూ సన్మానించారు. విశ్రాంత సహాయ వెనుక బడిన తరగతుల సంక్షేమ అధికారి టీ. రామప్ప, గురువులు పి. ప్రసాద్, విశ్రాంత ప్రిన్సిపాల్, విశ్రాంత జూనియర్ లెక్చరర్ కె. రమణా రెడ్డి, విశ్రాంత బి. సి. గురుకుల సూపరింటెండెంట్ టీ. వి రమణ, రామాంజి తదితరులు .ఈ సందర్భంగా టీ. రామప్ప మాట్లాడుతూ డిప్యూటీ కలెక్టర్ గా ఎంపికైన సురేష్ ను అభినందస్తూ, విధి నిర్వహణ లో ప్రజలకు ఉత్తమ సేవలందించి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని కోరారు. సురేష్ కు పుష్ప గుచ్చము అందజేసి శాలువ తో సన్మానం నిర్వహించారు.

## విద్యార్థి నాయకులను కిడ్నాప్ చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి...!

ధర్మవరం,ఫిబ్రవరి 3, ప్రభాతవార్త


కాలేజ్ సర్కిల్లో నిరసన తెలుపుతున్న విద్యార్థిసంఘాలనాయకులు

మోహన్ బాబు యూనివర్సిటీ లో జరుగుతున్నటు వంటి అక్రమాలను ప్రశ్నిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను దారుణంగా కిడ్నాప్ చేసిన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని విద్యార్థిసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కాలేజ్ సర్కిల్ ల్లోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మోహన్ బాబు యూనివర్సిటీలో శాంతియుతంగా ఎస్ఎఫ్ ఐ నాయకులు కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేయడానికి వెళ్తున్న క్రమంలో మోహన్ బాబు అనుచరులు కిడ్నాప్ చేయడంజరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున, ఏపీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శిబండి శివ, ఏఐఎస్ఓరాష్ట్ర కార్యదర్శి నిరంజన్యాదవ్, ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అమర్, శ్రీనాథ్, బాలాజీ పాల్గొన్నారు.

## సేంద్రియ, జీవన ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సు

శ్రీ సత్య సాయి జిల్లా వైద్యము ఫిబ్రవరి 3 ప్రభాతవార్త:


సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారుల ఆదేశాల మేరకు సేంద్రియ ,జీవన ఎరువుల ప్రాముఖ్యతపై రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించినట్లు ఏరువాకకేంద్రం పుట్టపర్తికోఆర్డినేటర్ డాక్టర్ కె. రామసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రసాయనిక ఎరువుల అధిక వినియోగం వల్ల నేలఆరోగ్యం దెబ్బతింటుందని, దీనికారణంగా నేలసారవంతత క్రమంగా తగ్గిపోతుందన్నారు. అంతేకాకుండా మట్టిలో ఉండాల్సినసూక్ష్మజీవులు, వానపాముల సంఖ్య కూడా తగ్గిపోతుందని చెప్పారు. అందుకే రైతులు సేంద్రియ మరియు జీవనఎరువుల వినియోగంపై దృష్టిసారించాలని సూచించారు. జీవన ఎరువుల వినియోగం వల్ల మట్టిలో కరగని స్థితిలో ఉన్న భాస్వరాన్ని మొక్కలకు అందుబాటులోకి తీసుకురావచ్చని తెలిపారు. అలాగే భూమిలో లభించని పొటాషియాన్ని కరిగించేందుకు పొటాషియం సాల్యూబిలైజింగ్ బ్యాక్టీరియా ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. గాలిలో ఉన్న నత్రజనిని రైజోబియం ద్వారా పప్పుదినుసుల పంటలకు వినియోగించుకోవచ్చని తెలిపారు. అజాటోబాక్టర్, అజోస్పైరిల్లం వంటి జీవన ఎరువులు ధాన్యపు పంటలకు మేలు చేస్తాయని చెప్పారు. సేంద్రియ, జీవన ఎరువుల వినియోగం ద్వారా నేల సారవంతత పెరిగి, దిగుబడులు మెరుగుపడడమే కాకుండా దీర్ఘకాలికంగా భూమి ఆరోగ్యం కాపాడబడుతుందని డాక్టర్ కె. రామ సుబ్బయ్య రైతులకు సూచించారు.

## అరటి పంటను ధ్వంసం చేసిన దుండగులు రూ" 50 వేలు నష్టం

కనగానపల్లి ఫిబ్రవరి 3 ప్రభాతవార్త


ధ్వంసం చేసిన అరటి పంట ను చూపుతున్న రైతు సత్యనారాయణ.

మండల కేంద్రానికి చెందిన రైతు లింగుంట్ల సత్యనారాయణ తోటలో గుర్తు తెలియని దుండగులు దాదాపు 100 అరటి చెట్లను ధ్వంసం చేశారు. దీంతో 50 వేల రూపాయలు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. రైతు తెలిపిన వివరాలు మేరకు అరటి పంటను రెండు ఎకరాల్లో సాగు చేశాడు. 20 రోజుల్లో పంట కోత దశలో ఉందని అంతలోనే సోమవారం రాత్రి గుర్తుగా తెలియని దుండగులు పంటను ధ్వంసం చేశారని ఆయన వాపోయాడు. పోలీసులు పంటను పరిశీలించి రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు.

09ATP27_09ATP27.qxd 03-02-2026 PM 10:49 Page 1



## మన నీరు మనభవిష్యత్తు కార్యక్రమానికి తరలివెళ్దాం



సాగునీటి సంఘం అధ్యక్షులతో సమావేశమైన టీడీపీ నాయకులు

ధర్మవరం టౌన్, ఫిబ్రవరి3 ప్రభాతవార్త

విజయవాడలో ఈనెల 5న జరిగే మన నీరు మనభవిష్యత్తు కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల చెరువు సాగునీటి సంఘం అధ్యక్షులు తరలివెళ్లి విజయవంతం చేయాలని టీడీపీ క్లస్టర్ ఇన్చార్జ్ మహేష్ చౌదరి అన్నారు. మంగళవారం పట్టణంలోని గాంధీనగర్లోని పార్టీ కార్యాలయంలో సాగునీటి సంఘం అధ్యక్షులతో సమావేశమెయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు సాగునీటి సంఘాల అధ్యక్షులతో మననీరు మనభవిష్యత్తు కార్యక్రమంను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారని. ఈ కార్యక్రమంతో నీటి అవసరాల అవశ్యకతను వివరిస్తారని తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ పోతుకుంట లక్ష్మన్న, నాయకులు విజయసారథి, రేనాటి శీన,అమరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయండి

- డిఎస్పి నర్సింగప్పకు ఫిర్యాదు చేసిన...పాపిరెడ్డిపల్లి రైతులు

గోరంట్ల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



డిఎస్పికి ఫిర్యాదు చేస్తున్న రైతులు

కొంతమంది అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని గోరంట్ల మండలం బూదిలి పంచాయతీ పాపిరెడ్డిపల్లి గ్రామ రైతులు మంగళవారం డిఎస్పి నర్సింగప్పను కలిసి అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరారు. స్పందించిన డిఎస్పి గోరంట్ల సిఐని పిలిపించి అక్కడ ఎటువంటి ఇసుక తవ్వకాలు జరగకుండా ఆపాలని అక్రమంగా ఇసుక తరలించే వారిపైన కఠిన చర్యలు తీసుకోవాలని సిఐకి తెలియజేశారు. డిఎస్పి మాట్లాడుతూ అక్కడ ఎటువంటి ఇసుక తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని రైతులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా కార్యవర్గసభ్యులు బాలస్వామి, గోరంట్ల మండల సిపిఐ నాయకులు నార్సింపల్లి కిష్ట, ఆంజనేయులు, రైతులు నాగమల్లప్ప, జి.మల్లికార్జున, మంజునాథ్, జి.శ్రీనివాసులు, పిసి మంజునాథ్, జియావుల్లా, రమేష్అప్ప, గంధం జయరాం, జి.ఆదిమూర్తి, పి.ప్రభాకర్రెడ్డి, విష్ణువర్ధన్రెడ్డి, రామకృష్ణారెడ్డి, రామాంజినప్ప, సీనప్ప, తదితర రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థుల పక్షాన నిలబడితే... ప్రశ్నించిన వారిని కిడ్నాప్ చేస్తారా

- తిరుపతిలో విద్యార్థి సంఘ నాయకులను కిడ్నాప్ చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- గోరంట్లలో పిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్ర

గోరంట్ల, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



పాత్రికేయులతో మాట్లాడుతున్న రాష్ట్ర సహాయ కార్యదర్శి

తిరుపతి పట్టణంలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై ఆందోళన చేస్తున్నటువంటి విద్యార్థి సంఘ నాయకులను కిడ్నాప్ చేసిన మోహన్‌బాబు బౌన్సర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చంద్ర డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ తిరుపతి పట్టణంలోని మోహన్‌బాబు యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు సిద్ధమైన విద్యార్థి సంఘ నాయకులు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి అక్బర్, యూనివర్సిటీ నాయకుడు వినోద్‌లను దారి మధ్యలో మోహన్‌బాబు యూనివర్సిటీ బౌన్సర్లు అడ్డుకొని వారిపై దాడి చేసి కిడ్నాప్ చేసి తమ వాహనాల్లో తీసుకెళ్లడం దారుణమన్నారు. మోహన్‌బాబు యూనివర్సిటీలో విద్యార్థుల నుండి వేల రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతుండటంతో యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళనకు సిద్ధమైన సమయంలో ఇలా జరగడం దారుణమన్నారు. యూనివర్సిటీలో జరిగిన తప్పును సరిదిద్దుకోకుండా యూనివర్సిటీ యాజమాన్యం ఇలా దౌర్జన్యాలకు పాల్పడటం సిగ్గుచేటని వారన్నారు. పోలీసులు వెంటనే స్పందించి ఈ ఘటన వెనుక ఎవరు ఉన్న కఠినంగా వ్యవహరించి క్రిమినల్ కేసులు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి యువజన సంఘాలను కలుపుకొని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

## వైకాపాలో చేరిన టిడిపి నాయకులు

లేపాక్షి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న దీపికారెడ్డి

లేపాక్షి మండల పరిధిలోని ఓబులాపురం హరి, కల్లూరి రవిలు తెలుగుదేశం పార్టీ వీడి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ దీపికా వేణురెడ్డి సమక్షంలో మంగళవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా దీపికారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పాలనపై విరక్తి చెంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలోకి పలువురు వస్తున్నట్లు ఆమె తెలిపారు. టిడిపి నుండి వైకాపాలో చేరిన హరి, రవిలకు పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నిస్సార్‌అహమ్మద్, మండల ఉపాధ్యక్షుడు అంజనరెడ్డి, వైకాపా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, వైకాపా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ పట్ల ఇంజనీరింగ్ విద్యార్థుల అవగాహన ర్యాలీ

గుత్తి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త




విద్యార్థులు ర్యాలీ చేస్తున్న దృశ్యం

నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన పెంపొందించు కోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు పిలుపునిచ్చారు. యాజమాన్యం ఆధ్వర్యంలో మంగళవారంరాత్రి గుత్తి పట్టణంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎండి రఘునాథ్‌రెడ్డి, కరస్పాండెంట్ వికె పద్మావతి, డైరెక్టర్ శ్రీవాణిలు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి, వ్యాయామం, పౌష్టికాహారంతో వ్యాధుల నుండి దూరంగా ఉంటూ ఆరోగ్యంగా ఉండవచ్చని పేర్కొన్నారు. ఆరోగ్య చైతన్యం పట్ల అవగాహన కోసం విద్యార్థులు చేపట్టిన ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏఒ ఇంతియాజ్‌బాషా, పిఆర్‌ఓ నాసిర్, పాల్గొన్నారు.

## తంబాలహట్టి రోడ్డు పనులు ప్రారంభం

అమరాపురం ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

అమరాపురం మండల పరిధిలోని హేమావతి పంచాయితీ తంబలహట్టి రోడ్డును మంగళవారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మురళీకృష్ణ , డి ఈ వెంకటేశ్వర్లు ఎంపీడీవో రామారావు, ఆధ్వర్యంలో మండల కన్వీనర్ కృష్ణమూర్తి మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు స్థానిక నాయకుడు గొల్ల మారనపల్లి రామచంద్రప్ప, తంబాలహట్టి రోడ్డును ఎక్స్‌కవైటర్ తో రోడ్డు పనులు ప్రారంభించారు. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు తంబాలహట్టి రోడ్డును వీలైనంత త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తంబాలహట్టి రోడ్డు ను సందర్శించి, గుత్తేదారును వీలైనంత త్వరగా రోడ్డును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎస్సీ సెల్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు జయకుమార్, మాజీ సర్పంచ్ కుమారస్వామి, పంచాయతీ కన్వీనర్ తిప్పర్జ క్లస్టర్ కన్వీనర్ కృష్ణమూర్తి మాజీ ఎంపీటీసీ శివకుమార్, ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్, తిమ్మే గౌడ, సీనియర్ నాయకుడు ప్రభాకర్, శ్రీనివాస్ యాదవ్, పాల్గొన్నారు.

## సమీకృత వ్యవసాయం ద్వారా రాబడిని పెంచడమే లక్ష్యం

- ఉరవకొండ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.సత్యనారాయణ - రాకెట్లలో వర్షాధారిత ప్రాంత అభివృద్ధి పథకంపై అవగాహన సదస్సు

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉరవకొండ ఏడీఏ ఎస్.సత్యనారాయణ. చిత్రంలో ఏవో బి.రామకృష్ణుడు ఉన్నారు

సమీకృత వ్యవసాయ ద్వారా రాబడిని పెంచి ప్రమాద వైఫల్యాలను తగ్గించడమే లక్ష్యమని వ్యవసాయశాఖ ఉరవకొండ సహాయ సంచాలకులు ఎన్.సత్యనారాయణ అన్నారు. వర్షాధారిత ప్రాంత అభివృద్ధి పథకంపై మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఏవో బి.రామకృష్ణుడు అధ్యక్షతన అవగాహన సదస్సు జరుగగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ ఎస్ సత్యనారాయణ మాట్లాడుతూ ఇది ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టమ్‌పై దృష్టి సారిస్తుందని, పంటలను ఉద్యాన వనాలుగా, పశువుల నుంచి సంపద, వ్యవసాయ, అటవీ వ్యవసాయంతో కలిపి రాబడిని పెంచడానికి, కరువు వంటి వాతావరణ ప్రమాదాలను తగ్గించడానికి, స్థాన నిర్దిష్ట ప్రణాళికలు, ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ వంటి ఇతర పథకాల కలయిక ద్వారా సహజ వనరుల సంరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. ఇంటిగ్రేటెడ్ ఫార్మిటంగ్ సిస్టం గురించి రైతులకు అవగాహన కల్పిస్తూ రైతులు వ్యవసాయమే కాకుండా పాడి పరిశ్రమ, వర్మీ కంపోస్టు లాంటి పద్ధతులను అవలంభించి వ్యవసాయాన్ని లాభసాటిగా మలుచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖలో అమలవుతున్న వివిధ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఏపీ ఏఐఎంఎస్ యాప్ గురించి రైతులకు అవగాహన కల్పిస్తూ ఈ యాప్‌లో వ్యవసాయానికి సంబంధించిన సలహాలు, సూచనలు, మార్కెటింగ్ ధరలు, ఈ-క్రాప్ బుకింగ్ స్వతహాగా చేసుకునే సౌలభ్యం కూడా లభిస్తుందని ఈ యాప్‌ను ప్రతి ఒక్కరూ తమ స్మార్ట్ మొబైల్ ఫోన్లలో ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 100 మంది రైతులతో ఏపీ ఏఐఎంఎస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ రాంమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ రంగ అభివృద్ధికి దోహదపడనున్న నూతన కోర్సులు

- ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా॥డి.ఆదినారాయణ

- డ్రోన్ టెక్నాలజీ, సాయిల్ టెస్టింగ్ సర్టిఫికేట్ కోర్సులు ప్రారంభం



కోర్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా॥డి.ఆదినారాయణ

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

దేశానికి వెన్నుముక అయిన వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితేనే దేశం పురోగాభివృద్ధి సాధిస్తుందని ఇందుకు డ్రోన్ టెక్నాలజీ, సాయిల్ టెస్టింగ్ కోర్సులు ఎంతో దోహదపడుతాయని కళాశాల ప్రిన్సిపాల్



సాయిల్ టెస్టింగ్ గూర్చి విద్యార్థినుల కు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

డా॥డి.ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినుల కోసం కొత్తగా డ్రోన్ టెక్నాలజీ, సాయిల్ టెస్టింగ్ సర్టిఫికేట్ కోర్సులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రిన్సిపాల్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఐదు రోజుల డ్రోన్ టెక్నాలజీ కోర్సు బీఎస్సీ కంప్యూటర్ సైన్సు, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్‌కు చెందిన 50 విద్యార్థినులతో నిర్వహిస్తున్నామన్నారు. సాయిల్ టెస్టింగ్ కోర్సు బీఎస్సీ కెమిస్ట్రీ, బయోలాజికల్ సైన్సు 50 మంది విద్యార్థినులతో నిర్వహిస్తున్నామన్నారు. రెండు కోర్సులకు ఆర్థిక సహాయం అందించిన గుంతకల్లు ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కాశాల అధ్యాపకులు, అతిథులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త డా॥బి.వెంకటరాముడు మాట్లాడుతూ విద్యార్థినుల నైపుణ్యాభివృద్ధికి ఈ రెండు కోర్సులు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఏరీస్ అగ్రికల్చర్ కంపెనీ జోనల్ మేనేజర్ శ్రీనివాసులు నాయుడు, అసిస్టెంట్ జోనల్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ కోర్సుల విధానం, ప్రయోజనాలు, కోర్సులు పూర్తీ చేసిన వారికి ఉద్యోగ అవకాశాలను వివరించారు. కంప్యూటర్స్ అధ్యాపకుడు యం.సుధాకర్ మాట్లాడుతూ కళాశాలకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) ద్వారా సహకారం అందించాలని ఏరీస్ అగ్రికల్చర్ కంపెనీ ప్రతినిధులను కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా॥రమేష్, నాగేంద్ర, గాయత్రి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దకోడిపల్లి గ్రామ శివారులో దారుణ హత్య- విచారిస్తున్న పోలీసులు.

రొద్దం. ఫిబ్రవరి 3 ప్రభాతవార్త.

మండల పరిధిలోని పెద్దకోడిపల్లి గ్రామానికి చెందిన లింగమయ్య( 25 సం ) ను గుర్తుతెలియని వ్యక్తులు గ్రామ శివారులో కత్తులతో పొడిచి చంపిన సంఘటన చోటుచేసుకుంది పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టడం జరిగింది.

## మహిళల సమస్యలకు చక్కటి పరిష్కార వేదిక ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లు

డీఎస్పీ కార్యాలయంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి టౌన్, ఫిబ్రవరి 3, ప్రభాతవార్త



మహిళా కౌన్సిలింగ్ సెంటర్ను ప్రారంభిస్తున్న ఎస్పి

కుటుంబాలతో పాటు సమాజంలో పలు సమస్యలు ఎదుర్కొంటున్న గృహిణులు, మహిళలకు చేయూతను అందించడం కోసం అసలైన మహిళా సమస్యల పరిష్కార వేదికగా పుట్టపర్తి ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ నిలుస్తుందని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పుట్టపర్తి డీఎస్పీ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ ను ఎస్పీ గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, కౌన్సెలింగ్ కోసం వచ్చే మహిళలకు పోలీసులు అన్ని విధాల అండగా నిలబడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గ్రీవెన్స్ లో రెవెన్యూ సమస్యల తర్వాత కుటుంబ తగాదా కేసులే ఎక్కువగా నమోదవుతున్నాయన్నారు. బాధిత మహిళలకు కౌన్సిలింగ్ ఇవ్వడానికి లాయర్ల, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, పోలీసు, మహిళా ప్రతినిధితో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇవ్వడం ద్వారా వారు పరస్పరం రాజీ పడి సంతోషంగా జీవించడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఈ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్ జిల్లాకే ఆదర్శంగా నిలిచేలసమస్యలు పరిష్కరించి మహిళలు, గృహిణులకు భరోసా ఇస్తామన్నారు. 40రోజులక్రితం కదిరిలో ప్రారంభించిన కౌన్సిలింగ్‌సెంటర్లో 27ఫిర్యాదులు అందగాఅందులో 16కేసును పరిష్కరించామన్నారు. మహిళా నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామని, అందులో భాగంగానే ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఇప్పటికే కదిరి, పెనుగొండ, ధర్మవరంలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. కౌన్సిలింగ్ సెంటర్ ను ఏర్పాటయ్యేందుకు కృషి చేసిన పుట్టపర్తి డీఎస్పీ విజయ కుమార్, బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసులు, సురేష్, ఎస్ఐ లు క్రాంతి కుమార్, మల్లికార్జునరెడ్డి, గోపాలకృష్ణ , న్యాయవాదులు అతవు రహిమాన్, జయ భారతి, ఎన్జీవో ప్రతినిధులు, మహిళలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ సతీష్ కుమార్

## సర్వేంద్రియానం నయనం ప్రధానమని గుర్తుంచుకోవాలి

- కంటి అద్దాల పంపిణీలో వైద్యాధికారి డాక్టర్ ఎన్.వి.ఎస్.చౌదరి

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఎన్.వి.ఎస్.చౌదరి

సర్వేంద్రియానం నయనం ప్రధానమని ప్రతిఒక్కరూ గుర్తించుకొని కళ్ళను జాగ్రత్తగా సంరక్షించుకోవాలని ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఎన్.వి.ఎస్.చౌదరి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించగా కళాశాల ప్రిన్సిపాల్ వి.హెచ్.వి.షాషావలి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.వి.ఎస్.చౌదరి మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ, అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఇదివరకు నియోజకవర్గంలోని ఉరవకొండ మండలంలోని పాఠశాలలు, కళాశాలల్లో 2,451 మంది విద్యార్థులు, కూడేరు మండలంలోని 852 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు జరుపడం జరిగిందన్నారు. ఇందులో కంటి అద్దాలు అవసరమైన 111 మంది విద్యార్థులను గుర్తించి వారికి ఉచితంగా వాటిని పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.హెచ్.బి.షాషావలి మాట్లాడుతూ టీవీలు, మొబైల్ ఫోన్లను దగ్గర నుంచి చూడటం, సరైన వెలుతురులేని చోట కూర్చొని చదవడం ద్వారా కంటి సమస్యలు వస్తాయని విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటించి కళ్ళను సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, అంధత్వ నివారణ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

## జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఆర్.రామప్ప నాయక్

- రెండోసారి నియమించిన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జడ శ్రవణ్‌కుమార్



జడ శ్రవణ్‌కుమార్ నుండి నియామకపత్రం అందుకొంటున్న ఆర్.రామప్ప నాయక్

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

జై భీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ఉరవకొండ మండలం రాకెట్ల తాండాకు చెందిన రమావత్ రామప్ప నాయక్ వరుసగా రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ నియామకపు ఉత్తర్వులను మంగళవారం ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్.రామప్ప నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకముంచి పార్టీను జిల్లాలో నడిపించే బాధ్యతలను అప్పగించిన పార్టీ వ్యవస్థాపకులు జడ శ్రవణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీను గ్రామీణ స్థాయి నుండి బలోపేతం చేయడానికి, పార్టీ సిద్ధాంతాలను ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## తల్లి రక్తహీనతవల్ల పుట్టబోయే పిల్లలపై అనేక దుష్ప్రభావాలు

- ఆశా డే కార్యక్రమంలో రాకెట్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పావని

ఉరవకొండ, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

తల్లి రక్తహీనతవల్ల పుట్టబోయే పిల్లలపై అనేక దుష్ప్రభావాలు పడే అవకాశంఉంటుందని వైద్యాధికారి డాక్టర్‌పావని అన్నారు.మండల పరిధిలోని రాకెట్ల పీహెచ్‌సీలో మంగళవారం ఆశాడే కార్యక్రమం నిర్వహించి వివిధ అంశాలపై అవగాహనకల్పించారు. గర్భిణీస్త్రీలు, చిన్నపిల్లలు, కిశోర బాలికల్లో కలిగే రక్తహీనతకుగల కారణాలు, నివారణ మార్గాలను వివరించారు. రక్తహీనత కారణంగా తక్కువబరువుతో జన్మించడం, మృతశిశువులు జన్మించడం, పిల్లల ఎదుగుదల, అభివృద్ధి లోపం ఏర్పడుతుందన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ షఫీ మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన జరుగబోయే జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 2 నుండి 19సంవత్సరాల మధ్యవయసుగల పిల్లలకు నులిపురుగుల నివారణకై అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయడం జరుగుతుందని దీని గురించి అందరికీఅవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, హెల్త్ అసిస్టెంట్లు వెంకటేష్, రమేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిరుత పులి సంచారంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వెంకటరమణ

తాడిమర్రి జనవరి 3 (ప్రభాతవార్త)



చిరుత పులి సంచారం పై గ్రామస్తులకు తెలియజేస్తున్న అటవీ అధికారులు

నార్పల మండలం బొందలవాడ సమీపంలో రైతులపై చిరుత పులి దాడి చేయడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం మండల పరిధిలోని పిన్నదరి, ఏకపాదంపల్లి తదితర గ్రామాలలోప్రజలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి చిరుత పులి సంచారంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ చిరుత పులి సంతానం వ్యాప్తి కోసం గానీ ఆహారం కోసం గాని రోజుకు సుమారు 50 కిలోమీటర్లు పయనిస్తుందని నార్పల మండలంలో సంచరించిన చిరుత పులి మండలంలో ప్రవేశించే అవకాశం ఉన్నందువ ల్లరైతులు, గొర్రెల,పశువుల, కాపరులు, కొండ ప్రాంతాల్లోకి పొలాల్లోకి వెళ్లాల్సినప్పుడు ఒంటరిగా వెళ్లకూడదని అలాగే ఏదైనా కర్ర గాని, ఆయుధం గాని వెంటతీసుకుని వెళ్లాలని సూచించారు. తప్పనిసరిగా పొలాల్లోకి వెళ్లాల్సి వస్తే ఏదైనా శబ్దం చేసుకుంటూ వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బందితోపాటు పంచాయితీ కార్యదర్శి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దుర్గామాత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న హనుమంతనాథ స్వామిజీ

గుడిబండ ఫిబ్రవరి 3 ప్రభాతవార్త



దుర్గామాత ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

మండల పరిధిలోని ఎస్ రాయపురం గ్రామంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో హనుమంతనాథ స్వామిజీ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.తదనంతరం కళశలతో మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి నర్సేగౌడ్, రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పోరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ,హలకూరు కాంతరాజు, మందలపల్లి నాగరాజు, సర్పంచ్ డిఎల్ యంజారేగౌడ్, నటరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఆధార్‌క్యాంపులను సద్వినియోగం చేసుకోండి

అగళి, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త

ఈ నెల 6వ తేది వరకు పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో సచివాలయాల ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధార్‌క్యాంపులను నిర్వహిస్తున్నట్లు ఏఓ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. 15 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సుగల వారు తప్పనిసరిగా బయోమెట్రిక్ వివరాలు నమోదు చేసుకోవడానికి వీలుగా ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఈ నెల 16 నుంచి 20వ తేది వరకు రెండవ విడత ఆధార్‌క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ రెండవ విడత క్యాంపుల్లో పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో ఈ క్యాంపులను నిర్వహిస్తామని సచివాలయాల డైరెక్టర్ శివప్రసాద్ తెలిపారు.

## వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించండి

జిల్లా వైద్యా అధికారి ఫిరోజ్ బేగం

తాడిమర్రి జనవరి 3 (ప్రభాతవార్త)



ఆశ వర్కర్లకు సూచనలు, సలహాలు ఇస్తున్న జిల్లా వైద్యా అధికారి

ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యాధికారి ఫిరోజ్ బేగం ప్రభుత్వం ఆసుపత్రి వైద్యులకు సూచించారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆమె ప్రభుత్వాసుపత్రితో పాటు నార్సింపల్లి జేవీఎంఆర్డిటి పాఠశాలను సందర్శించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆశ వర్కర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాలలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం తీసుకోవలసిన జాగ్రత్తలపై తగ్గిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా వేసవికాలంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం నార్సింపల్లి జేవిఎంఆర్డిటి పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరిత, డాక్టర్ గోవర్ధన్ నాయుడు, పీహెచ్యన్ లక్ష్మి దేవి, ఎం పి హెచ్ ఎ జానకిరామ్ తో పాటు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ఏపి ఎన్‌జిఓ ఉద్యోగుల సమస్యల పై సమావేశం

మడకశిర ఫిబ్రవరి 03 ప్రభాతవార్త:

తాలూకా ఏపి ఎన్ జి ఓ కార్యవర్గ సమావేశం ను మంగళ వారం ఉదయం 11:00 గంటలకు స్థానిక ఆర్ అండ్ బి విశ్రాంతి భవనం నందు తాలుకా కార్యవర్గ సభ్యుల పరిచయం మరియు ఉద్యోగుల సమస్యలు మరియు ఉద్యోగులు మరియు పెన్షనర్లకు డి ఏ ఆరియర్స్ బకాయిలు ఇంతవరకు జమకాని సమస్య పై చర్చించారు. మరియు ప్రభుత్వం నుండి ఉద్యోగులకు మరియు రిటైర్డు అయిన ఉద్యోగులకు పెండింగ్లో ఉన్న గ్రాట్యుటీ,సరెండర్ లీవ్ మరియు ఉద్యోగులకు రావలసిన జి పి ఎఫ్, ఏపి జి ఎల్ ఐ, సరెండర్ లీవ్ బకాయిలు వచ్చే ఆర్థిక సంవత్సరంలో చెలించి,12 వ పిఆర్సి కమిషన్ వేసి ఐఆర్ ఇవ్వవలసినదిగా మరియు సిపిఎస్ ఉద్యోగులకు ఓ పి ఎస్ వర్తింప చేయాలన్నారు. అదేవిధంగా విజయవాడలో ఆదివారం నాడు అనగా 08022026 వ తేదీన జరుగు రాష్ట్ర ఏపిఎన్‌జిఓ ల కార్యవర్గం ఎన్నికలకు ఏపిఎన్ జిఓల మడకశిర తాలుకా కార్యవర్గ సభ్యులు,అన్ని శాఖల ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై ప్యానెల్ కు మద్దతు తెలియజేయాలని కోరడమైనది. ఈ సమావేశం నందు శ్రీ సత్య సాయి జిల్లా జాయింట్ సెక్రటరీ సిబ్గత్ ఉల్ల, మడకశిర తాలుకా అధ్యక్షులు ఎల్.రాము మరియు కార్యదర్శి ట్రెసరీ హరినాథ్ , అసోసియేట్ అధ్యక్షులు ఎస్.అనిల్ కుమార్ వైస్ ప్రెసిడెంట్ లు ఎస్. రమేష్ నాయక్, ఏ.వి.రాజేష్ బాబు మరియు జాయింట్ సెక్రటరీలు యం.దిలీప్ కుమార్,బి. షిఫా కౌసర్, మల్లప్ప మరియు ఉమెన్ సెక్రటరీ మల్లీశ్వరి మరియు ట్రేజరర్ నలినాక్షి మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరినాథ్

